క్రమబద్ధీకరణపై ఏం చేస్తారో?

- గ్రామపంచాయతీ నుంచి కార్పొరేషన్‌గా ఆవిర్భావం
- మరో 10 రోజుల్లో జవహర్‌నగర్‌ జీహెచ్‌ఎంసీలో విలీనం..
- ఏళ్లుగా పెండింగ్‌లో జీఓ 58,59 దరఖాస్తులు
- ఏం నిర్ణయం తీసుకుంటారోనని దరఖాస్తుదారుల అయోమయం



జవహర్‌నగర్‌లో క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులు ఇచ్చిన మహిళలు (ఫైల్‌)

జవహర్‌నగర్‌: మరో 10 రోజుల్లో జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ జీహెచ్‌ఎంసీలో విలీనం అవుతున్న వేళ..ఇళ్ల క్రమబద్ధీకరణ అంశం మళ్లీ తెరపైకి వస్తోంది. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో రాష్ట్రమంతటా జీవో 58,59 ప్రకారం దరఖాస్తులు స్వీకరించి ఇళ్లను క్రమబద్ధీకరించినా, జవహర్‌నగర్‌లో మాత్రం కొంత మేరకు దరఖాస్తులు తీసుకుని ఏ నిర్ణయం తీసుకోకుండా వదిలేశారు. పైగా పేదలు డీడీల రూపంలో చెల్లించిన దాదాపు రూ.8 కోట్లకు పైగా నిధులను ప్రభుత్వ ఖాతాలో వేసుకుని.. సమస్యను మాత్రం ప్రశార్థకంగా మిగిల్చారు. అసలు ఎందుకు క్రమబద్ధీకరణ దరఖాస్తులు పరిష్కరించలేదని ఆరా తీస్తే..అధికారులు ఓవైపు కోర్టు కేసులని, మరోవైపు మా పరిధిలో లేదంటూ పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు. దీంతో దరఖాస్తుదారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

- గ్రామపంచాయతీ నుండి నగర పాలక సంస్థ వరకు ఎదిగిన జవహర్‌నగర్‌ తాజాగా జీహెచ్‌ఎంసీలో విలీనమవుతుండడంతో వందలాది మంది తమ ఇళ్ల క్రమబద్ధీకరణపై అయోమయం చెందుతున్నారు. ఏ క్షణంలో ఏమవుతుందోనని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.
- వార్డు నుండి మొదలైన జవహర్‌నగర్‌ ప్రస్థానం మేజర్‌ గ్రామపంచాయతీగా ఎదిగి ప్రస్తుతం కార్పొరేషన్‌గా అవతరించి..జీహెచ్‌ఎంసీలో కలవనుంది. ప్రత్యేక అధికారుల పాలన మళ్లీ మొదలుకానుంది. ఇప్పటికైనా తమ నివాసాలకు జీవో 58, 59 ప్రకారం క్రమబద్ధీకరించి న్యాయం చేస్తారని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

60 వేలకు పైగా నివాసాలు..

- జవహర్‌నగర్‌లో దాదాపు 3 లక్షల మంది నివసిస్తూ, 60 వేల పైబడి ఇళ్లు నిర్మించుకున్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జీఓ నెం.58 విడుదల చేస్తూ ప్రభుత్వ భూమిలో 125 గజాలలోపు ఆక్రమించిన వారికి ఉచితంగా రిజిస్ట్రేషన్‌ చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే జీఓ 59 ప్రకారం 125 గజాల కంటే ఎక్కువ స్థలాన్ని ఆక్రమించిన వారికి మార్కెట్‌ ధర ప్రకారం రిజిస్ట్రేషన్‌ చేసుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ జీవోల ప్రకారం జవహర్‌నగర్‌ గ్రామంలో గ్రామకంఠంగా ఏర్పడిన 330.34 ఎకరాల స్థలంలో ఉన్న వారికి మాత్రమే వెసులుబాటు కల్పిస్తూ అప్పటి శామీర్‌పేట్‌ తహసీల్దార్‌ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అవకాశాన్ని జవహర్‌నగర్‌ ప్రజలు వినియోగించుకుని జీఓ నెం.58 ప్రకారం 2,300 మంది, 59 జీఓ ప్రకారం దాదాపు 5,500 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే దాదాపు రూ.8 కోట్ల రూపాయలు డీడీ రూపంలో అందించారు. ఇంకా 45 వేలకు పైబడి దరఖాస్తులు తీసుకోవాల్సి ఉంది. కానీ పరిస్థితి మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది.

క్రమబద్ధీకరించకుంటే పోరాటం



జవహర్‌నగర్‌లో ఎందరో నిరుపేదలు అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్నారు. డబ్బులు కట్టి క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేశారు. రాష్ట్రంలోని అన్నిప్రాంతాల్లో జీవో 58,59 ప్రకారం ఇళ్లు క్రమబద్ధీకరించారు. ఇక్కడ మాత్రం పెండింగ్‌లో పెట్టారు. దీనిపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇప్పటికే ఎన్నో పోరాటాలు చేశాం. కాంగ్రెస్‌ ప్రభుత్వం న్యాయం చేయకుంటే మళ్లీ పోరాటాలకు దిగుతాం.

– చంద్రమౌళి, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం రాష్ట్ర కన్వీనర్‌

సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం



ఇన్నేళ్లుగా నివాసాలు ఏర్పరచుకుని జీవిస్తున్న వారి ఇళ్లను క్రమబద్ధీకరించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. జవహర్‌నగర్‌ భూ సమస్యను పరిష్కరించి పేద ప్రజలందరికి నివాసహక్కులను కల్పించేందుకు కాంగ్రెస్‌ సర్కార్‌ ప్రత్యేక కృషి చేస్తోంది. క్రమమబద్ధీకరణ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అర్హులకు న్యాయం చేస్తాం.

– మల్లెపూల శ్రీకాంత్‌ యాదవ్‌, కాంగ్రెస్‌ పార్టీ జవహర్‌నగర్‌ అధ్యక్షుడు



జవహర్‌నగర్‌లో ఇళ్లను క్రమబద్ధీకరించాలని ప్రజాహక్కుల పరిరక్షణ పోరాట కమిటీ ఆందోళన (ఫైల్‌)

శాశ్వత పరిష్కారానికి కృషి



జవహర్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడానికి శ్రద్ధ తీసుకున్నా. కాంగ్రెస్‌ ప్రభుత్వం జవహర్‌నగర్‌ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తోంది. పేద ప్రజల హక్కుల కోసం కాంగ్రెస్‌ ప్రభుత్వం కట్టుబడి ఉంది. త్వరలో ఉన్నతాధికారులతో చర్చించి ఈ సమస్యను పరిష్కరించి జవహర్‌నగర్‌ రూపు రేఖలు మారుస్తాం.

– మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మేడ్చల్‌ మాజీ ఎమ్మెల్యే

మల్లారెడ్డి మంత్రిగా ఉన్నా



గత ప్రభుత్వంలో మల్లారెడ్డి మంత్రిగా పనిచేసినా జవహర్‌నగర్‌ భూములు క్రమబద్ధీకరించడంలో విఫలమయ్యారు. కేవలం ఆయన కళాశాలలు, ఆసుపత్రులు, రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారాలను మాత్రమే పెంపొందించుకుని పేదలు నివసించే జవహర్‌నగర్‌ను గాలికి వదిలేశారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి త్వరలో శాశ్వత పరిష్కారం లభించేలా కృషి చేస్తాం.

– తోటకూర జంగయ్య వజ్రేష్‌ యాదవ్‌, కాంగ్రెస్‌ మేడ్చల్‌ ఇన్‌చార్జి

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

పోచారం: విద్యుత్‌ మరమ్మతులు జరుగుతున్నందున శనివారం కరెంట్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ప్రదీప్‌ కుమార్‌ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అన్నోజిగూడ, ఎల్‌ఎన్‌ కాలనీ, ఎల్‌ఐజీ, జైపురికాలనీ, సత్యానగర్‌, సాయి నగర్‌, ఇందిరానగర్‌, మధ్యాహ్నం 2 నుంచి 2:30 గంటల వరకు పోచారం, డాక్టర్స్‌ కాలనీ, విజయ్‌ సాయి ఎన్‌క్లేవ్‌ ప్రాంతాలకు విద్యుత్‌ సరఫరా ఉండదని తెలిపారు.

మేడ్చల్‌లో..

ఐడీఏ మేడ్చల్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం పలు పరిశ్రమలకు విద్యుత్‌ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ రాంబాబు తెలిపారు. 11 కేవీ కండ్లకోయ, సీఎంఆర్‌, ఎస్‌ఎస్‌ మిల్‌ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఈ నెల 20న జాబ్‌మేళా

మేడ్చల్‌రూరల్‌: ఈ నెల 20న విజయనగర్‌ కాలనీలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిషిప్‌ మేళా మరియు జాబ్‌ మేళా నిర్వహిస్తున్నట్లు మేడ్చల్‌ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌ శైలజ తెలిపారు. మేళాలో మల్టీనేషన్‌ కంపెనీలు పాల్గొంటాయని ఐటీఐ, 10వ తరగతి పూర్తైన అభ్యర్థులు తమ సర్టిఫికేట్లతో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రీ-అసెస్‌మెంట్‌కు సహకరించాలి

పోచారం: ఆస్తి పన్ను రీ-అసెస్‌మెంట్‌కు ప్రజలు సహకరించాలని చైర్మన్‌ కొండల్‌రెడ్డి శుక్రవారం కోరారు. శ్రీనిధి కళాశాల యాజమాన్యం రీఅసెస్మెంట్‌కు సహకరించకపోవడంతో కలెక్టర్‌తో పాటు సీఎం ఆఫీస్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఆరేళ్లుగా శ్రీనిధి కళాశాల ఏటా రూ. 28.28 లక్షల ఆస్తిపన్ను చెల్లిస్తోందని, రీఅసెస్మెంట్‌ చేస్తే దాదాపు కోటి పైనే ఆస్తిపన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. హోటళ్లు, వ్యాపార సంస్థలు, హాస్టళ్లు, కళాశాలలు రీఅసెస్మెంట్‌కు సహకరించి, మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

ప్రభుత్వ అధికారులతో దురుసు ప్రవర్తన

ఇద్దరు వ్యక్తుల పై కేసు నమోదు

జవహర్‌నగర్‌: అక్రమ నిర్మాణాలను కూల్చివేయకుండా అడ్డుకుని, ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసిన ఘటన జవహర్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌లోని సర్వే నెంబర్‌-702లో అక్రమ నిర్మాణాలను కాప్రా తహసీల్దార్‌ సుచరిత ఆదేశాలతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ రమేష్‌ సిబ్బందితో కలిసి కూల్చివేసేందుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో అక్కడే ఉన్న రామునాయక్‌, శేఖర్‌ అనే వ్యక్తులు రెవెన్యూ అధికారులపై దురుసుగా ప్రవర్తించి అడ్డుకున్నారు. తహసీల్దార్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న కౌన్సిలర్‌ మణికంఠగౌడ్‌

మేడ్చల్‌రూరల్‌: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి శస్త్ర చికిత్స నిమిత్తం మేడ్చల్‌ కౌన్సిలర్‌ మణికంఠగౌడ్‌ ఆర్థిక సాయం అందజేశారు. ఈ నెల 5న మేడ్చల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులతో పాటు చిన్నారి మృతి చెందిన ఘటనలో కుమారుడు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతుండగా.. అతని శస్త్ర చికిత్స నిమిత్తం కౌన్సిలర్‌ మణికంఠ గౌడ్‌ మేడ్చల్‌ ఇన్‌స్పెక్టర్‌ సత్యనారాయణతో కలిసి రూ.50 వేల ఆర్థిక సాయాన్ని బాలుడి బంధువులకు అందజేశారు. కార్యక్రమంలో మోనార్క్‌ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



నర్సింగ్‌రావు (ఫైల్‌)

జవహర్‌నగర్‌: వృద్ధుడు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాప్రాల్‌ శైలిగార్డెన్‌ వద్ద నివసించే జొన్నపల్లి నర్సింగ్‌రావు (72) కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. నర్సింగ్‌రావు బ్రెయిన్‌ ట్యూమర్‌ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నెల 17న ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఉదయం లేచి గేటు తాళం తీసి నర్సింగ్‌రావు బయటకు వెళ్లాడు. ఎంతకూ తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని ఆచూకీ కోసం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గట్టుమైసమ్మ గుట్టను సందర్శించిన ఏసీపీ



జాతర సౌకర్యాలపై ఆరా తీస్తున్న ఏసీపీ చక్రపాణి, చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య

ఘట్‌కేసర్‌: పట్టణంలోని గట్టుమైసమ్మ గుట్టను మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పావనీజంగయ్యతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ఆలయ పరిసరాలు, అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌ అమ్మవారి ముఖద్వారం నుంచి ఆలయానికి వెళ్లే భక్తులు బైపాస్‌ రోడ్డు దాటడానికి దారి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ఈఓ భాగ్యలక్ష్మిని జాతర ఏర్పాట్లు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్‌ పరశురాం, ఎస్సై శేఖర్‌, కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్‌, రవీందర్‌, జహంగీర్‌, ఆలయ అభివృద్ధి మాజీ డైరెక్టర్‌ జంగారెడ్డి, ట్రాఫిక్‌ పోలీసులు, మున్సిపల్‌, ఎండోమెంట్‌ అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ ఈటల నివాసానికి పార్లమెంట్‌ స్టాండింగ్‌ కమిటీ బృందం



ఎంపీ ఈటల నివాసంలో స్టాండింగ్‌ కమిటీ చైర్మన్‌ కీర్తీ ఆజాద్‌తో స్థానిక బీజేపీ నాయకులు

మేడ్చల్‌ రూరల్‌: కెమికల్స్‌ అండ్‌ ఫర్టిలైజర్స్‌ పార్లమెంటరీ స్టాండింగ్‌ కమిటీ బృందం శుక్రవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ నివాసానికి వచ్చింది. ఇటీవల పార్లమెంట్‌ సమావేశాల్లో ప్రసంగించిన ఎంపీ ఈటల..నగర శివారు ఐడీపీఎల్‌లో మూతపడిన కెమికల్‌ ఫ్యాక్టరీ గురించి ప్రస్తావించారు. ఈ మేరకు శుక్రవారం కెమికల్స్‌ అండ్‌ ఫర్టిలైజర్స్‌ పార్లమెంటరీ స్టాండింగ్‌ కమిటీ చైర్మన్‌ కీర్తిఆజాద్‌తో పాటు సభ్యుల బృందం ఐడీపీఎల్‌లోని పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల శామీర్‌పేట్‌లోని తన నివాసంలో స్టాండింగ్‌ కమిటీకి తేనేటి విందు ఏర్పాటు చేశారు. కీర్తీ ఆజాద్‌తో పాటు ఎంపీలు పిల్లి సుభాష్‌ చంద్రబోస్‌, బలరాం నాయక్‌, సంజయ్‌ రౌత్‌, కీర్తిదేవి, ప్రసాద్‌ రావు తదితరులు పాల్గొన్నారు. కాగా ఈటల నివాసంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు విక్రంరెడ్డి, స్థానిక నాయకులు మల్లిఖార్జున్‌ ముదిరాజ్‌, చంద్రశేఖర్‌ యాదవ్‌, సుదర్శన్‌, గిరివర్ధన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, జగన్‌గౌడ్‌లు కమిటీ బృందానికి స్వాగతం పలికారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

- జిల్లా స్పెషల్‌ ఆఫీసర్‌, స్టేట్‌ ఫ్లాగ్‌ షిప్‌ ప్రాజెక్టు కమిషనర్‌ శశాంక
- రైతు ఆత్మీయ భరోసా, రేషన్‌ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష



సాక్షి, సిటీబ్యూరో: రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాలను అర్హులకు అందించే దిశగా జిల్లా అధికార యంత్రాంగం పని చేయాలని జిల్లా స్పెషల్‌ ఆఫీసర్‌, స్టేట్‌ ఫ్లాగ్‌ షిప్‌ ప్రాజెక్టు కమిషనర్‌ కె.శశాంక అన్నారు. శుక్రవారం నగర శివారు శామీర్‌పేట తహసీల్దార్‌ కార్యాలయంలో సంక్షేమ పథకాలపై జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌తో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి సర్వే నంబర్‌ ప్రకారం వ్యవసాయానికి యోగ్యమైనదా?, కాదా? అనే స్పష్టతను గుర్తించాలన్నారు. గ్రామాల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలను నిర్వహించాలన్నారు. భూ భారతి (ధరణి) పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమికి మాత్రమే ప్రభుత్వం రైతు భరోసా చెల్లిస్తుందని తెలిపారు. సాగుకు యోగ్యం కాని భూముల జాబితాను గ్రామ సభల్లో ప్రదర్శించాలని సూచించారు. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లాల వారీగా వచ్చిన ముసాయిదా అర్హుల జాబితాలో లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియలో భాగంగా ఉపాధి హామీ కూలీ గుర్తింపు కార్డును, ఆధార్‌ కార్డుతో లింక్‌ చేయాలన్నారు. జిల్లాల వారీగా కుల గణన సర్వే ఆధారంగా రేషన్‌ కార్డులు లేని పేద కుటుంబాల జాబితాను పరిశీలించాలన్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, మున్సిపాలిటీలో కమిషనర్‌ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులుగా ఉంటారన్నారు. వితంతువులకు, భూమిలేని వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

- జిల్లా స్పెషల్‌ ఆఫీసర్‌, స్టేట్‌ ఫ్లాగ్‌ షిప్‌ ప్రాజెక్టు కమిషనర్‌ కె.శశాంక శామీర్‌పేట మండలం అలియాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారురాలు పద్మ ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తూముకుంటలో రేషన్‌ కార్డుల సర్వేను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌(రెవెన్యూ) విజయేందర్‌ రెడ్డి, శామీర్‌పేట్‌ తహసీల్దార్‌ యాదగిరి, డీఆర్‌డీఏ సాంబశివరావు, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, జిల్లా పౌర సరఫరాల అధికారి సుగుణబాయి, హౌజింగ్‌ పీడీ రమణ మూర్తి, తూంకుంట మున్సిపల్‌ కమిషనర్‌ వెంకట గోపాల్‌, ఎంపీడీఓ సుగుణ బాయి పాల్గొన్నారు.

డివిజన్‌ అభివృద్ధికి అహర్నిశలు కృషి



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ నిహారికగౌడ్‌

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ 28వ డివిజన్‌ పరిధిలోని అయ్యప్ప కాలనీ, లక్ష్మీనర్సింహ కాలనీలో ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌డీఎఫ్‌) రూ. 22 లక్షలతో నిర్మించే భూగర్భ డ్రైనేజీ పనులను శుక్రవారం కార్పొరేటర్‌ కారింగుల నిహారికగౌడ్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. వజ్రేష్‌యాదవ్‌ సహకారంతో మరిన్ని నిధులు తెచ్చి డివిజన్‌ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ కారింగుల శంకర్‌గౌడ్‌, డివిజన్‌ అధ్యక్షులు బూడిద వెంకటేష్‌, నాయకులు రమేష్‌చారి, మహేందర్‌యాదవ్‌, చెన్నారెడ్డి, అనిల్‌ ముదిరాజ్‌, చారి, అశోక్‌, దివాకర్‌, కిషోర్‌, నరేష్‌, విజయలక్ష్మీ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీలకు క్రీడాకారుల ఎంపిక



పోచారం: జాతీయ, అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొనేందుకు మేడ్చల్‌ మాల్కాజిగిరి జిల్లా జేకేపీ స్పోర్ట్స్‌ కరాటే అకాడమీ నుంచి జిల్లా అధ్యక్షుడు మాస్టర్‌ గుగులోత్‌ గోవింద్‌ నాయక్‌ ఆధ్వర్యంలో 31 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలుపుతూ పోచారంలో ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో మొత్తం 1100 మంది కరాటే క్రీడాకారులు పాల్గొంటారని, వీరిలో మన జిల్లా నుంచి 31 మంది ఉన్నారని గోవింద్‌ అన్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్‌ సభ్యులు నాగరాజు, సాయి కిరణ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

బోడుప్పల్‌: ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్‌ శ్రీసాయిరాంనగర్‌ కాలనీలోని సీతారామాంజనేయ స్వామి ఆలయం ఆవరణలో ఆయన సొంత నిధులతో ఆర్‌ఎంసీ కాంక్రీట్‌తో రోడ్డు వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆనందంగా జీవించేందుకు కృషి చేయాలని, దైవ చింతనతో జీవించాలని సూచించారు. బోడుప్పల్‌ ఈస్ట్‌ జోన్‌ బీజేపీ అధ్యక్షుడు ఏర్పుల మహేష్‌, జిల్లా ఉపాధ్యక్షులు రాసాల నర్సింగ్‌రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు తుప్పత్‌ ఆనంద్‌, శ్రీసాయినగర్‌ కాలనీ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌, సంతోష్‌, శరత్‌చంద్రారెడ్డి పాల్గొన్నారు.

'లక్ష డప్పులు.. వెయ్యి గొంతులు' విజయవంతం చేద్దాం



మల్లన్న ఆలయం వద్ద ఎమ్మార్పీఎస్‌ ముఖ్య నేతల సమావేశం

కీసర: ఈ నెల 27న మేడ్చల్‌ జిల్లా పరిధిలోని ఘట్‌కేసర్‌ సమీపంలో ఎమ్మార్పీఎస్‌ ఆధ్వర్యంలో నిర్వహించనున్న లక్ష డప్పులు, వెయ్యి గొంతులు సన్నాహక సమావేశం విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మార్పీఎస్‌ అధ్యక్షులు పంగ ప్రణయ్‌ పిలుపునిచ్చారు. శుక్రవారం చీర్యాల మల్లన్న ఆలయం వద్ద నిర్వహించిన ఎమ్మార్పీఎస్‌ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరుగనున్న వేల గొంతులు-లక్షల డప్పుల మహా ప్రదర్శనను విజయవంతం చేయడంలో భాగంగా ఈ నెల 27న జిల్లా పరిధిలోని ఘట్‌కేసర్‌లో నిర్వహించనున్న సన్నాహక డప్పుల ప్రదర్శనకు మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిధిగా విచ్చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఘట్‌కేసర్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నూతన కార్యవర్గ ఏర్పాటు..

ఈ సందర్భంగా కీసర మండల ఎమ్మార్పీఎస్‌ నూతన కమిటీని ఎంపిక చేశారు. కీసర మండల ఎమ్మార్పీఎస్‌ అధ్యక్షులుగా కుమార్‌, ప్రధాన కార్యదర్శిగా గణేష్‌, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్‌, సంతోష్‌, కార్యదర్శులుగా శ్రీనివాస్‌, సంజీవ, లింగయ్య, అధికార ప్రతినిధులు గంగి ఆంజనేయులు, కిరణ్‌, రవి, మల్లేష్‌, తుడుం శంకర్‌, శ్రీకాంత్‌, రవి, శేఖర్‌, శ్యామ్‌, శివరాజ్‌ తదితరులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కీసరమండల ఎమ్మార్పీఎస్‌ మాజీ అధ్యక్షులు శంకర్‌, జగన్‌, రాజలింగం, తుడుంబాల్‌రాజ్‌, రామారం రమేష్‌, రాజు, మల్లేష్‌, స్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలం పై వినతిపత్రం అందజేత





కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి 4వ వార్డులో శ్మశాన వాటిక కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరుతూ శుక్రవారం కౌన్సిలర్‌ లక్ష్మీ వేణుగోపాల్‌ ఆధ్వర్యంలో వివిధ కాలనీల సంక్షేమ సంఘం అధ్యక్షులు, బీజేపీ నేతలతో కలిసి నాగారం మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డితోపాటు, కమిషనర్‌ భాస్కర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గణపురం శ్యాంసుందర్‌, నితిన్‌, జయచందర్‌, రామారావు, అంజనేయులు, అశోక్‌, శ్రీనివాస్‌, రామచంద్రారెడ్డి, వివిధ కాలనీల ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమాధుల స్థలం రక్షించాలంటూ తహసీల్దార్‌కు వినతి

ఘట్‌కేసర్‌: క్రైస్తవులకు ప్రభుత్వం కేటాయించిన సమాధుల స్థలాన్ని సంరక్షించాలని కోరుతూ పలువురు క్రైస్తవులు స్థానిక తహసీల్దార్‌ రజనికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. మాదారం గ్రామంలోని సర్వేనెంబర్‌ 195/2లోని 5 ఎకరాల ప్రభుత్వ భూమిని క్రైస్తవుల స్థలం కోసం 2017 అప్పటి ప్రభుత్వం కేటాయించిందని లేఖలో తెలిపారు. సమాధుల కోసం కేటాయించిన స్థలంలో ఇటీవల పీసీడబ్ల్యూఏజీఎం అనే వ్యక్తి అక్రమించి క్రైస్తవుల అనుమతి లేకుండా త్రవ్వకాలు చేపట్టి మట్టిని తరలిస్తున్నారన్నారు. అధికారులు స్పందించి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్‌ చేశారు. సుంధర్‌రావు, రాజేష్‌, మార్టీన్‌, సునిల్‌, జాన్‌మార్‌, కెఫా తదతరులు వినతి పత్రం అందజేశారు.

భూసర్వేను పరిశీలించిన జేసీ



తహసీల్దార్‌ కార్యాలయంలో మాట్లాడుతున్న జేసీ విజయేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్‌: ఘట్‌కేసర్‌ తహసీల్దార్‌ కార్యాలయాన్ని జేసీ విజయేందర్‌ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సాగుకు అనువైన భూమి, సాగుకు పనికి రాని భూముల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జేసీ మాట్లాడుతూ.. మండలంలో 9 గ్రామాల్లో సర్వే పూర్తి అయిందని, మిగతా 6 గ్రామాల్లో సర్వేయర్లు, వ్యవసాయాధికారులు గల 5 బృందాల సర్వే చేస్తున్నారన్నారు. ఈ నెల 26న ప్రారంభించనున్న రైతు భరోసా కార్యక్రమానికి ముందే లబ్ధిదారుల పట్టికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, తహసీల్దార్‌ రజని, నాయబ్‌ తహసీల్దార్‌ రాజేందర్‌, సీనియర్‌ అసిస్టెంట్‌ ఆదిత్య, ఆర్‌ఐలు సాయిరాం, కావ్యరెడ్డి, మండల వ్యవసాయాధికారి బాసిత్‌, సహాయ అధికారి జగదీష్‌, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.